సాక్షి
వికారాబాద్
ఆదివారం । 7 । జూలై । 2024



పరిగి: తుంకల్‌గడ్డలోని ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో నిలిచిన మురుగు



తుంకల్‌గడ్డలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేకపోవడంతో గోనె సంచులు అడ్డుగా పెట్టిన దృశ్యం

సం'క్షామ' హాస్టళ్లు



ధారూరు: జీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థుల గదిలో చెత్తాచెదారం

పేద విద్యార్థులు, వెనుకబడిన వర్గాల పిల్లల చదువు వారి తల్లి దండ్రులకు భారం కారాదనే ఉద్దేశంతో వసతిగృహాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. తాగునీటి వసతి లేకపోవడం, నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నా వాటి నిర్వహణ అధ్వానంగా ఉంది. ఉన్న వాటికి తలుపులు, నీటి వసతి లేదు. బాత్‌రూంలో కాలు పెడితే జారిపడేంత పాకుర పట్టాయి. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. తరచూ భోజనం వికటించి విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా పట్టించుకునే నాథులు లేకుండా పోయారు.

మిగతా 8లో▸



కొడంగల్: పట్టణంలోని బీసీ వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

న్యూస్‌రీల్

వ్యాపారులు విధిగా లైసెన్సు పొందాలి

- ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా
- జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ సునిత



దుకాణ యజమానికి రసీదు ఇస్తున్న సునిత

ధారూరు: ఆహార పదార్థాలు విక్రయించే వారు మూడు రకాల ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుందని ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ సునిత సూచించారు. శనివారం ధారూరు సంతలో టీ స్టాల్స్, కిరాణ దుకాణాలు, హోటళ్ల వద్దకు వెళ్లి లైసెన్సు, శిక్షణపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కల్తీ ఆహార పదార్థాలను గుర్తించడంపై వ్యాపారులకు శిక్షణ ఇస్తామన్నారు. ఏ ఒక్క వ్యాపారి వద్ద ఫుడ్ సేఫ్టీ లైసెన్సు లేదని తెలిపారు. టీ స్టాల్, హోటల్ నిర్వహించే వారికి తాము ఉచితంగా శిక్షణ ఇస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి, ప్రాణానికి హాని కలగని ఆహార పదార్థాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

జోనోసిస్ డేను విస్మరించిన అధికారులు



తాండూరులోని పశువైద్యశాల

తాండూరు: పశువులు, పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా జూలై 6న నిర్వహించే జోనోసిస్ డేను తాండూరు పశు వైద్యశాల అధికారులు విస్మరించారు. శనివారం పశు వైద్యశాలకు ఆ శాఖ అధికారులు రాకపోవడంతో కార్యక్రమాన్ని నిర్వహించలేదు. అటెండర్ మాత్రమే విధులకు హాజరయ్యారు. దీంతో శిబిరం నిర్వహించ లేదు.

వీర ముష్టి సంఘం భూముల అటాచ్

సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు



వీర ముష్టి సంఘం భూముల్లో బోర్డు పాతిన అధికారులు

మోమిన్‌పేట: కోర్టు అనుమతితోనే చక్రంపల్లిలోని వీరముష్టి సంఘానికి చెందిన వ్యవసాయ భూములను అటాచ్ చేస్తున్నట్లు సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్వాధీనం చేసుకున్న భూముల్లో బోర్డు పాతారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చక్రంపల్లి వాసులు ఆరు సంవత్సరాల క్రితం వీర ముష్టి సంఘం పాలకవర్గం 70 కోట్ల రూపాయలు మోసం చేసిందని కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు సంఘం ఆస్తులను జప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో చక్రంపల్లిలో సంఘానికి చెందిన వ్యవసాయ భూములను అటాచ్ చేశారు. సర్వే నంబరు 186లో 4 ఎకరాల 24 గుంటలు, 187లో 3 ఎకరాలు, 27లో 2 ఎకరాల 20 గుంటలు, 22లో 2 ఎకరాల 10గుంటల భూములను అటాచ్ చేశారు. ఈ భూములపై ఎవరూ ఎలాంటి లావాదేవీలు జరపరాదని సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్‌ఐ రామారావు, సీసీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె



చేవెళ్ల: రాష్ట్ర మంత్రులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన శనివారం నగరంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పంట రుణాలు అరకొరే!

ఇస్తున్న వాటికి రెండింతలవుతున్న పెట్టుబడులు

- బ్యాంకర్లు సహకరించడం లేదంటున్న అన్నదాతలు
- వానాకాలం సీజన్ ప్రారంభమై నెల గడిచినా రుణ ప్రణాళికే లేదు



వికారాబాద్: ప్రభుత్వం నిర్ణయిస్తున్న పంటల రుణ పరిమితి సాగు పెట్టుబడులకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇస్తున్న రుణాలకు రెండింతలు సాగు కోసం ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రతిసారీ బ్యాంకర్లు మూస ధోరణితో రుణ పరిమితి నిర్ణయిస్తున్నారు. పంట పెట్టుబడి ఖర్చులను అంచనా వేయటంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్లు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాగులో అధునాతన పద్ధతులు పాటించాలని సూచిస్తున్న ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా పంటల రుణ పరిమితి పెంచడం లేదు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణపరిమతి అరకొరగా పెంచగా ఈ ఏడాది రుణ ప్రణాళికను ఇంకా ప్రకటించలేదు. ఈ సారైనా ప్రభుత్వం రుణ పరిమితి పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆరుతడి పంటల విషయంలో కొంత బాగానే ఉన్నా.. నీటిని పారించి పండించే పంటల విషయంలో వారు నిర్ణయించిన రుణ పరిమితి ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రధానంగా టమాటా, వంకాయ, అరటి, పూలు, మామిడి తోటలు తదితర ఉద్యాన వన పంటలకు పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అవుతుండగా ప్రభుత్వం మాత్రం అందులో సగం కూడా ఇవ్వడం లేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం మళ్లీ అప్పులు చేయక తప్పటంలేదు. జిల్లాలో 2.8 లక్షల మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. వీరిలో 2.1 లక్షల మంది రుణాలు తీసుకుంటున్నారు. వీరితోపాటు 8వేల మంది కౌలు రైతులు ఉన్నా వీరికి బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడం లేదు.

ప్రతీసారి నామమాత్రంగానే..

పంటల రుణ పరిమితి పెంపును ప్రభుత్వం ప్రతి ఏడాది సీజన్ ఆరంభంలో ప్రకటిస్తుండగా ఈ ఏడాది ఇంకా ప్రకటించలేదు. రోజురోజుకూ సాగు పెట్టుబడులు భారీగా పెరుగుతున్నా.. ప్రభుత్వం మాత్రం అరకొరగా రుణ పరిమితి ప్రణాళికను అమలు చేస్తోంది. గత కొంతకాలంగా రుణ పరిమితి పెంచాలని ప్రతిపక్షాలు, రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

రుణ ప్రణాళిక తయారు ఇలా..

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ (టెస్కాబ్) ఆధ్వర్యంలోని రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ రుణ ప్రణాళికను తయారుచేసి నాబార్డుకు, వ్యవసాయశాఖకు అందజేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా నాబార్డు వ్యవసాయ రుణ ప్రణాళికను రూపొందిస్తుంది. దీని ఆధారంగానే పంటల వారీగా బ్యాంకర్లు రుణాలను అందజేస్తారు. పత్తి, పసుపు లాంటి వాణిజ్య పంటలకు ఎకరానికి కాస్త ఎక్కువగా రుణాలను ఇస్తారు. ఆరుతడి, తదితర పంటలకు తక్కువ రుణం ఇస్తారు. జిల్లాలో పండించే ప్రధాన పంటలను మొదటగా గుర్తిస్తారు. ఇందులో వాణిజ్య, సాధారణ పంటల జాబితాలను వేర్వేరుగా రూపొందిస్తారు. పంటల వారీగా సాగువ్యయం, సాగు ఆధారంగా పంటల రుణ పరిమితిని ఖరారు చేస్తారు. పత్తి, కంది, వరి, మిర్చి, పెసర, శనగ, వేరుశనగ, కూరగాయల పంటలు.. ఇలా పంటల వారీగా రుణపరిమితిని ఖరారు చేస్తారు. ఆయా జిల్లాల్లో పండించే పంటల ఆధారంగా సాగు వ్యయాన్ని బట్టి లీడ్ బ్యాంకు బ్యాంకర్లతో రుణాలను అందించే ఏర్పాట్లు చేస్తుంది. సాగునీటి వసతి ఉన్న పంటలకు ఒక రకంగా, నీటి వసతిలేని పంటలకు మరో విధంగా పంటల రుణ పరిమితిని నిర్ణయిస్తారు.

గతేడాది పంటల వారీగా రుణపరిమితి ఇలా..

ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ప్రధాన పంటల రుణ పరిమితి ఇలా ఉంది. జిల్లాలో అధికంగా పండించే కంది పంటకు ఎకరానికి కనిష్టంగా రూ.18వేల నుంచి గరిష్టంగా రూ. 22 వేల వరకు ఇవ్వాలని నిర్ణయించారు. వరి పంటకు రూ.38 వేల నుంచి రూ.42వేల వరకు, పత్తి పంటకు రూ.32,400 నుంచి రూ.38,400 వరకు, అదే విధంగా పెసర పంటకు ఎకరానికి రూ.18 నుంచి రూ.20 వేలు, పచ్చిమిర్చి పంటకు రూ.68 వేల నుంచి రూ.75వేలు, వేరుశనగకు రూ.32 వేల నుంచి రూ.35 వేలు, అత్యధికంగా అరటి రూ. 5నుంచి రూ.80 వేలు, పొద్దుతిరుగుడు పంటకు రూ.19 వేల నుంచి రూ.24 వేలు, జొన్న పంటకు రూ.17వేల నుంచి రూ.20 వేలు, రాగి పంటకు రూ.16 వేల నుంచి రూ. 20 వేలు వరకు, మినుము పంటకు రూ.18 నుంచి రూ.20 వేల వరకు, మొక్కజొన్నకు రూ.38 నుంచి రూ. 42 వేలు వరకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వొచ్చని ప్రభుత్వం పేర్కొంది.



కొడంగల్ ప్రభుత్వాస్పత్రి

కొడంగల్‌కు టీచింగ్ హాస్పిటల్

- మెడికల్ కళాశాలకు అనుబంధంగా..
- 50 నుంచి 220 బెడ్ల స్థాయికి పెంపు
- త్వరలో ఆయుష్ మెడికల్ కళాశాల

కొడంగల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. కొడంగల్ అభివృద్ధి పనులపై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా టీచింగ్ హాస్పిటల్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని ఎంపిక చేశారు. ఆస్పత్రి ఆవరణలో టీచింగ్ హాస్పిటల్‌ను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.27 కోట్లు మంజూరు చేశారు. జూన్ 28న కలెక్టర్ ప్రతీక్‌జైన్ కొడంగల్ ఆస్పత్రిని సందర్శించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. పనులను ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండలంలోని అప్పాయిపల్లి శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించనున్నారు. భవనాలు, మౌలిక వసతుల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.46 కోట్లు విడుదల చేశారు. ఫిజియోథెరపీ కళాశాలను, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వీటి నిర్మాణం కోసం రూ.27 కోట్లు వెచ్చించనున్నారు. కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 పడకల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. త్వరలో ఆయూష్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి, పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసే అవకాశం ఉందని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఆయుర్వేదిక్, హోమియోపతి, యూనానీ, నేచురోపతి (బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్ఎంఎస్) కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయుష్ ఆసుపత్రులకు పూర్వ వైభవం తేనున్నారు.

జనరల్ సర్జరీలు చేస్తున్నాం



పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. డాక్టర్లు, వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి గురువారం జనరల్ సర్జరీలు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలి. ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించాం. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ప్రైవేటుకు వెళ్లకుండా ప్రభుత్వాస్పత్రికి రావాలి.

– డాక్టర్ చంద్రప్రియ, ఆస్పత్రి సూపరింటెండెంట్, కొడంగల్

ఎంత పని చేశావ్ దేవుడా..

రోజూ మాదిరిగానే తల్లి చేతి గోరు ముద్దలు తిని.. బైబై చెబుతూ బడికి వెళ్లిన చిన్నారి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ మాతృమూర్తి రోదనలు మిన్నంటాయి. ఎంత పని చేశావు దేవుడా.. అంటూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

- లారీ రూపంలో బాలుడిని కబళించిన మృత్యువు
- వెనకనుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఎనిమిదేళ్ల చిన్నారి దుర్మరణం
- గోపన్‌పల్లి వద్ద ఘటన
- వలస కుటుంబంలో తీరని విషాదం



జనార్దన్ (ఫైల్)



ప్రమాదం నుంచి బయటపడిన తండ్రి, కూతురు



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తల్లి వరలక్ష్మి, బంధువులు

తాండూరు రూరల్: వలస కుటుంబంలో విషాదం నెలకొంది. రోడ్డు పైన నిలిపి ఉన్న లారీని రివర్స్ తీస్తుండగా.. వెనక ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో.. లారీ టైర్ల కింద నలిగి ఎనిమిదేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషాద సంఘటన తాండూరు మండలం గోపన్‌పల్లి వద్ద శనివారం ఉదయం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లా గుత్తి మండలం అనియన్‌దొడ్డి గ్రామానికి చెందిన మదం హన్మంతు, వరలక్ష్మి దంపతులు 20 ఏళ్ల క్రితం తాండూరుకు వలస వచ్చారు. గోపన్‌పల్లి వద్ద ఉన్న నజీర్ పాలిషింగ్ యూనిట్లో హన్మంతు కార్మికుడిగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు శశికళ, ధరణి, కొడుకు జనార్దన్(8) సంతానం. శశికళ తాండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్, జనార్దన్ పట్టణంలోని విజయ విద్యాలయంలో 3వ తరగతి చదువుతున్నారు. ప్రతిరోజు వీరిద్దరిని హన్మంతు ఉదయాన్నే తన బైక్‌పై తీసుకెళ్లి, సాయంత్రం ఇంటికి తీసుకొస్తాడు.

రెప్పపాటులో..

ప్రతిరోజు మాదిరిగానే శనివారం ఉదయం 8 గంటలకు పాలిషింగ్ యూనిట్ వద్ద ఉన్న అద్దె గది నుంచి హన్మంతు తన కూతురు శశికళ, కొడుకు జనార్దన్‌ను బైక్‌పై తీసుకుని బయలుదేరాడు. ఈక్రమంలో కరన్‌కోట్‌కు చెందిన లారీ ఏపీ 28 వై 4579 గోపన్‌పల్లి– తాండూరు మెయిన్ రోడ్డుపై నిలిచి ఉంది. స్కూటీపై తాండూరు వెళ్తున్న హన్మంతు ఎడమ వైపు వెళ్లేందుకు.. లారీ వెనకాల తన ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. ఇది గమనించని డ్రైవర్ లారీని రివర్స్ తీయడంతో బైక్‌ను ఢీకొట్టింది. హన్మంతు, శశికళ రోడ్డుకు కుడి వైపున పడిపోయారు. ఎడమ వైపు టైర్ల కింద పడిన జనార్దన్ తల పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే చనిపోయాడు. తండ్రి, అక్క కళ్ల ముందే రెప్పపాటులో జనార్దన్ విగతజీవిగా మారాడు. విషయం తెలుసుకున్న కార్మికులు పెద్ద సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

అక్క పుట్టిన రోజే తమ్ముడి మృతి

శశికళ పుట్టిన రోజు కావడంతో శనివారం ఉదయాన్నే జనార్దన్ అక్కకు బర్త్ డే శుభాకాంక్షలు చెప్పాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక కేక్ కట్ చేద్దామంటూ స్కూల్‌కు బయల్దేరారు. కానీ అంతలోనే విధి వక్రీకరించి బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

లారీ డ్రైవర్‌పై కేసు

తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి బాలుడి మృతదేహాన్ని తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా లారీ నడిపి బాలుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆర్‌బీఎస్ ఫ్యాక్టరీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ఆంక్షలు అమలు చేయాలి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

తాండూరు: బడి వేళల్లో పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా పాత పద్ధతి ప్రకారమే ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని కోరారు. శనివారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు మండలం గౌతాపూర్‌లో పాఠశాలకు వెళుతున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఉదయం 8నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు భారీ వాహనాలు తాండూరు పట్టణంలోకి రాకుండా చూడాలన్నారు. ఇందుకు డీఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ తాండూరు పట్టణ అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు రాజు, ప్రకాష్, చందు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

- విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- మధ్యాహ్న భోజనంలో రాజీపడొద్దు
- డీఈఓ రేణుకాదేవి



బూచన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

వికారాబాద్: విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. శనివారం మండలంలోని బూచన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌ను, మర్పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణ రుపొందించుకొని పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. వర్షాలు పడుతున్నందున పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో రాజీపడొద్దని ఆదేశించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. మరుగుదొడ్లను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. మర్పల్లి కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట సీఆర్‌పీఎఫ్ మల్లేశం, యాదయ్య ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలు



రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ధారూరు: పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. అనంతరం స్టేషన్‌ధారూరు పాఠశాల విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు అశోక్ ముదిరాజ్, మహ్మద్ బాబాకాన్, బుజ్జయ్యగౌడ్, నారాయణరెడ్డి, రాములు, మల్లారెడ్డి, సత్యనారాయణగౌడ్, హన్మయ్య, గఫార్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



కలప లోడుతో లారీ

దుద్యాల్: ఓ పక్క హరితహారం పేరుతో ప్రభుత్వం చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడుతుండగా.. మరోపక్క కొందరు దుండగులు యథేచ్ఛగా కలపను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. శనివారం దుద్యాల గేటు సమీపంలో ప్రధాన రహదారికి పక్కన ఎంహెచ్ 34 బీజీ 5012 నంబరు గల లారీలో.. మహబూబ్‌నగర్‌కు చెందిన జకుల అంజి కలపను తరలిస్తున్నట్లు కూలీలు తెలిపారు. కలప రవాణా గురించి అంజిని నిలదీయగా పొంతనలేని సమాధానం చెప్పాడు. అంతటితో అగకుండా మీకేందుకు.. మా ఇష్టం. మీరేమన్న చేసుకోండి. అని విలేకరిని బెదిరించే ప్రయత్నం చేశారు. ఇంత పెద్ద మొత్తంలో కలప రాష్ట్రం దాటుతుండగా.. అటవీశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు.

ఆర్థిక సాయం

వికారాబాద్: మండల పరిధిలోని మల్లికార్జుననగిరి గ్రామానికి చెందిన అర్జున్‌గారి లక్ష్మి (65) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్టు చైర్మన్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు.

నీటిలో చిక్కుకున్న కారు

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని వై జంక్షన్ కూడలీ సమీపంలో నిర్మించిన అండర్‌పాస్ శనివారం కురిసిన వర్షానికి అండర్‌పాస్ కిందకు భారీగా వరద నీరు చేరింది. ఈ క్రమంలో తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీశైలం తనకారులో వరద నీటిని అంచనా వేయ కుండా వెళ్లగా.. కారు నీటిలో చిక్కుకుంది. డోర్లు తెరచుకోకపోవడంతో కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న సిబ్బంది, స్థానికుల సహాయంతో డోరు తెరవడంతో ఆయన బయటకు వచ్చారు. అనంతరం కారును నీటిలోంచి తీశారు.

సం'క్షామ' హాస్టళ్లు

సర్కారు వసతి గృహాల్లో సంక్షేమం కొరవడింది. శిథిల భవనాలు, వర్షం కురిస్తే గదుల్లో నీరు చేరుతాయి. తలుపు లేని మరుగుదొడ్లు, నీరు లేని స్నానాల గదులు ఇలా ఒక్కటేమిటి.. అనేక సమస్యలు హాస్టళ్లలో తిష్ట వేశాయి. ప్రభుత్వాలు మారుతున్నా గృహాల సమస్యలు పట్టించుకునే వారు కనిపించడం లేదని, చదువుపైన ఉన్న మమకారంతో బిక్కుబిక్కుమంటూ కాలమెల్లదీస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల పరిగి, వికారాబాద్ హాస్టళ్లలో పలు కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం జిల్లాలోని పలు హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేయగా వెలుగు చూసిన సమస్యలపై కథనం..



ధారూరు: బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానపు గదులపై ఉండాల్సిన వాటర్‌ట్యాంకు మరమ్మతుకు నోచుకోకపోవడంతో కింద పడేశారు

- వసతుల లేమితో వసతి గృహాలు
- బహిర్భూమికి ఆరుబయటికే..
- తాగునీటి కటకట.. బోరునీళ్లతో సరిపెట్టుకుంటున్న విద్యార్థులు
- సరిపడా అధ్యాపకులు లేక కుంటుపడుతున్న విద్య

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పేరుకు పోయాయి. కనీస వసతులు కొరవడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పేద పిల్లలకు మౌలిక సదుపాయాలతో పాటు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హాస్టళ్లను ఏర్పాటు చేసింది. అక్కడే వసతి వెసులు బాటు కల్పించింది. కానీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా హాస్టళ్లలో వసతులు గతి తప్పాయి. పట్టణంలో బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర, బాలికల, ఎస్టీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. బీసీ గృహంలో 80మందికి పైగా విద్యార్థులు ఉండగా.. మరుగుదొడ్లు లేవు. అత్యవసరంగా ఆరుబయటకు పరుగులు తీయాల్సి వస్తుందని పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం.. బహిర్భూమికి బయటకు వెళ్లాలంటే పాములు, తేళ్లు తదితర విషపురుగులు తిరుగుతుంటాయని ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో భవనం..

భవనం శిథిలావస్థలో ఉంది. వర్షం వస్తే కురుస్తుంది. గదుల్లో నీరు చేరుతుంది. రాత్రి వేళల్లో పడుకోడానికి విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. తలుపులు, కిటికీలు సరిగ్గా లేవు. హాస్టల్ సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపామని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాధిక తెలిపారు. ప్రస్తుత భవనంలో ఇబ్బందిగా ఉందని, తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మూడు గదులు ఇస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



కొడంగల్: బీసీ వసతి గృహంలో విరిగిన గది తలుపులు

శిథిల భవనం.. విరిగిన కిటికీలు



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న సన్‌సైడ్

యాలాల: బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు సతమతమవుతున్నారు. పెచ్చులూడిన భవనం. చిన్నపాటి వర్షానికి తడిసే గోడలు, విరిగిన కిటికీలు, తలుపులతో భయాందోళన చెందుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో సన్‌సైడ్‌లు పెచ్చులూడి ఇనుపచువ్వలు తేలాయి. చిన్నపాటి వర్షానికి పైకప్పుతో పాటు గోడలు తడిసిపోతున్నాయి. భవన మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు గతంలో పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసినా ఫలితం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి యంత్రం ప్రస్తుతం మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. విధిలేక విద్యార్థులు గృహంలోని బోరు నీటిని తాగుతున్నారు. వంటగది, పాత్రలు శుభ్రంగా ఉన్నప్పటికీ వసతుల విషయంలో మాత్రం అన్యాయం జరుగుతుంది.

కనీస వసతులు కరువు



బీసీ హాస్టల్ మరుగుదొడ్డి దుస్థితి

ధారూరు: సమస్యల వలయంలో ధారూరు బీసీ బాలుర వసతిగృహం కొట్టుమిట్టాడుతోంది. ఇందులో సుమారు 90 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. కనీస వసతులు కొరవడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్టల్ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్త చెదారం నిండి ఉంది. కంపు కొడుతున్న మరుగుదొడ్లతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ దీపాలు సరిగా లేక రాత్రి పూట చదువుకోవటం కష్టంగా మారిందని తెలిపారు. పడక గదిలో ఫ్యాన్లు సరిగా లేవని, మరుగుదొడ్లకు, స్నానాల గదులకు నీటి సరఫరా లేకపోవడంతో బకెట్ల ద్వారా తీసుకెళ్లాల్సి వస్తుందని చెప్పారు.

పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్

పూడూరు: మండల పరిధి కస్తూర్బా బాలికల వసతి గృహంలో వసతులు కొరవడ్డాయి. 250 మందికి సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బంది విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. భవనం పాఠశాల నుంచి ఇంటర్ స్థాయికి పెంచడంతో విద్యార్థుల సంఖ్య పెరిగి, సౌకర్యాలు తగ్గడంతో పాటు, అసౌకర్యంగా మారింది. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతుకు గురయింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు లేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



పనిచేయని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్

టాయిలెట్లకు తలుపులు లేవు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని బాలుర ఎస్సీ వసతి గృహంలో కొన్ని మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోయాయి. స్నానాలు చేసే వద్ద నల్లాలను బంద్ చేశారు. తాగు నీటి కుళాయిల అపరిశుభ్రత. ఇన్ని అసౌకర్యాల నడుమ విద్యార్థుల అల్లాడిపోతున్నారు. వంట గది, పాత్రలు శుభ్రంగానే ఉన్నాయి.



మరుగుదొడ్లకు ఊడిన తలుపులు

అద్దె భవనాల్లో వసతి



బాలుర కళాశాల వసతిగృహంలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పలు వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బీసీ బాలికల కళాశాల, బాలుర కళాశాల, ఎస్సీ బాలికల, ఎస్టీ బాలికల కళాశాల వసతిగృహాలను అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఇరుకైన భవనాల్లోనే ఏళ్ల తరబడి నడిపిస్తున్నారు.

టమాటా పచ్చడి, సాంబర్‌తో సరి



ఎస్టీ ఆశ్రమంలో పచ్చడి మెతుకులతో భోజనం చేస్తున్న విద్యార్థులు

వికారాబాద్: మర్పల్లి మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ గరుకుల పాఠశాలలో నాణ్యమైన భోజనం వడ్డించడం లేదని విద్యార్థులు తెలిపారు. మెనూ ప్రకారం పెరుగు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదన్నారు. ఆశ్రమ పాఠశాలలో 245 మందికి శనివారం 205 మంది ఉన్నారు. మెనూ ప్రకారం ఉదయం రాగిజావ లేదా పాలు అందించాలి. కానీ అవేమీ ఇవ్వలేదు. టమాట కిచిడి, పప్పుతో కూడిన సాంబర్‌తో సరిపెడుతున్నారు. తాగునీటి కోసం వాటర్ ఫిల్టర్ యంత్రం ఉన్నా.. పాఠశాల బోరు బావి నుంచి వచ్చే నీటినే తాగుతున్నారు. బాత్‌రూంలు ఉన్నా నీటిసరఫరా లేదు. గణితం, ఫిజికల్ సైన్స్, హిందీ తదితర అధ్యాపకులు లేక చదువులు ముందుకు సాగడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు పుస్తకాలు, దుస్తులు ఇవ్వలేదని చెప్పారు. పాఠశాలలో హెచ్‌ఎం నర్సింగ్‌రావుతో పాటు మరో 8 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, వారిలో ఏ ఒక్కరూ పాఠశాలలో రాత్రి పూట ఉండరని, ఒక వాలంటర్, వాచ్‌మెన్ మాత్రమే ఉంటారని పేర్కొన్నారు.

శిథిలావస్థలో బీసీ వసతి గృహం

మండల కేంద్రంలోని బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. అందులో ఉంటున్న విద్యార్థులు బిక్కుబిక్కు కాలమెల్లదీస్తున్నారు. 40 మందిగాను.. 26 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మెనూ ప్రకారం వంటలు వడ్డించడం లేదని విద్యార్థులు తెలిపారు.

పనిచేయని తాగునీటి శుద్ధియంత్రం



మరమ్మతుకు నోచుకోని వాటర్ ఫిల్టర్

పెద్దేముల్: బీసీ బాలుర వసతి గృహంలో రెండేళ్లుగా వాటర్ ఫిల్టర్ పనిచేయటం లేదు. తద్వారా శుద్ధిజలాలు అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మొత్తం 50 మంది విద్యార్థులకు శనివారం 43మంది ఉన్నారు. 2024కు సంబంధించి కొత్త మెనూ రాక, పాత మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారు. నీటి శుద్ధి యంత్రం పాడై.. బయట నుంచి తాగునీటిని తెప్పించి విద్యార్థులకు సరఫరా చేస్తున్నామని వార్డెన్ సంఘమేశ్వర్ తెలిపారు. విద్యార్థులకు ఇప్పటి వరకు కార్పెట్లు, బెడ్ షీట్లు అందలేదని పేర్కొన్నారు.

ప్రహరీ లేక పందుల విహారం



నిరుపయోగంగా ఉన్న స్నానపు గదులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం సమస్యలకు నిలయంగా మారింది. ఈ గృహంలో 30మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడా మరుగుదొడ్లు లేవు. ఉన్న 8 మరుగుదొడ్లలో రెండు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. స్నానపు గదులు నిరుపయోగంగా మారాయి. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నా.. కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. హాస్టల్‌కు ప్రహరీ లేక పందులు సంచరిస్తున్నాయని, అపరిశుభ్రతతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు.

కాలకృత్యాలకు క్యూ



నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం పనులు

వికారాబాద్: బంట్వారం మండల కేంద్రంలోని కోట్‌పల్లి కేజీబీవీ బాలికల వసతి గృహంలో సమస్యలు తిష్ట వేశాయి. పక్కా భవనం లేక స్థానిక ప్రాథమిక పాఠశాలలో హాస్టల్ కొనసాగుతోంది. తరగతి గదులు చాలక, వారి సంఖ్యకు తగినట్లుగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. గంటల తరబడి లైన్లో ఉండి.. ఉన్నవాటితో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. మనఊరు-మనబడి కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగానే మిగిలాయి. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నట్లు ఎస్‌ఓ పల్లవి తెలిపారు. పక్కా భవన నిర్మాణ పనులు కరీంపూర్ గేట్ సమీపంలో కొనసాగుతున్నాయని, భవనం పూర్తి కాగానే కోట్‌పల్లి నుంచి వసతి గృహాన్ని అక్కడికి తరలిస్తామని ఆమె స్పష్టంచేశారు.

అపరిశుభ్రత.. అనారోగ్యం



అపరిశుభ్రంగా విద్యార్థులు గది

తాండూరు: ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. ఉన్నవారికి సరైన వసతులు లేక ఇబ్బంది పడుతుండగా.. కొత్తగా చేరిన వారికి దుప్పట్లు, దుస్తులు ఇప్పటి వరకు అందలేదు. తాండూరు బీసీ బాలుర, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో నీటి శుద్ధి యంత్రం పనిచేయడం లేదు. దీంతో పిల్లలు బోరు నీటితో దాహం తీర్చుకుంటున్నారు. బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల పైకప్పు బీటలు వారి పెచ్చులు ఊడుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షానికి నీరు గదుల్లోకి చేరుతున్నాయి. బస చేసే గదులు పరిశుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. టీఎస్ ఆర్‌ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి దూరంగా ఉండటంతో సరైన భద్రత కరువైంది. గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం సరిగా అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మిషన్ భగీరథ నీరేదిక్కు



పని చేయని ఆర్‌ఓ ప్లాంట్

తాండూరు రూరల్: వసతి గృహాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పరిసరాల అపరిశుభ్రతతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. పట్టణంలోని మాణిక్‌నగర్‌లో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో 70 మంది ఉన్నారు. ఇక్కడే ఉంటూ వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. గృహంలోని ఆర్‌ఓ ప్లాంట్ కొంత కాలంగా పనిచేయటం లేదు. దీంతో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు కరువైంది. చేసేది లేక భగిరథ నీరు తాగుతున్నారు. హాస్టల్ ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలు, అపరిశుభ్రత పేరుకు పోయి, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తు

రైతులకు మేలు చేసే నిర్ణయాలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చైర్మన్ బాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు గిట్టుబాటు ధరలు అందించేలా నూతన కమిటీ పని చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సూచించారు. శనివారం వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ కమిటీ బాధ్యతలు కట్టబెట్టడంపై ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి, సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని రైతులకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మార్కెట్ యార్డు ప్రతిష్ఠను మరింత పెంచేలా పాలన కొనసాగాలని దిశానిర్దేశం చేశారు.

లీడర్‌షిప్ లక్షణాలు అలవర్చుకోవాలి

అనంతగిరి: విద్యార్థులు చిన్నతనం నుంచే లీడర్‌షిప్ లక్షణాలు అలవర్చుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని సెయింట్ జూడ్స్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్కూల్‌లో లీడర్లుగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కౌన్సిలర్ మోముల రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తైబజార్ వేలం వాయిదా

కొత్తూరు: మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించే తైబజార్ వేలాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ పరిధిలో రోడ్లపై నిలిపే లారీలు, ఇతర వాహనాల నుంచి తైబజార్ నిర్వాహకులు డబ్బులు వసూలు చేయాలా..? వద్ద అనే ప్రశ్న తలెత్తడంతో వేలాన్ని నిలిపివేశారు. టెండర్‌లో పాల్గొన్న వ్యక్తులు వేసిన ఈ ప్రశ్నను మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, సభ్యులతో చర్చించి వారి నుంచి సమాధానం తీసుకున్న తర్వాత వేలం చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

రైతుల పక్షాన పనిచేయండి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాధవరెడ్డి, చందర్

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే సూచన

బషీరాబాద్: మండల రైతాంగం పక్షాన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం పని చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, వైస్ చైర్మన్ ముథావత్ చందర్ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాల పంపిణీ మొదలుకొని పంట దిగుబడి కొనుగోలు వరకు అండగా ఉండాలని సూచించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.